


పట్టు రైతుల సమస్యలపై ప్రస్తావన

శాసనసభ సమావేశల్లో ఎమ్మెల్యే అమర్

ప్రజాశక్తి- పలమనేరు: సిరికల్చర్ రైతులకు ప్రోత్సాహాన్ని ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో పాల్గొన్న ఆయన పట్టు రైతుల సమస్యలపై శాసనసభలో తన గళం వినిపించారు. 2014 నుంచి 2019 వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టు రైతులను అన్ని విధాలా ప్రోత్సహించి ఆదుకుందన్నారు. అప్పట్లో షెడ్లు, యంత్రాలు, ఎరువులు, పురుగుల మందులను సబ్సిడీ ధరలకు అందించడమేగాక పండించిన గూళ్లకు ప్రోత్సాహంగా ఇన్సెంటివ్ ఇచ్చి ప్రోత్సహించిందన్నారు. అయితే ఆ తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం పట్టు రైతులను అన్ని విధాల విస్మరించిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడుస్తున్న తరుణంలో పట్టు రైతులకు పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్‌ను మంజూరు చేయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

రానున్న వేసవిలో జిల్లాలోని మండలాల్లో తాగునీటి ఎద్దడి నివారణ విషయంలో ఎంపిడిఒలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, డిఈఈ, ఏఈఈ, ఈఓ పిఆర్డిలతో సమావేశం ఏర్పాటు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రానున్న ఏప్రిల్ మాసంలో తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉన్నందున మండలాలలో ముందస్తు చర్యలు చేపట్టడానికి అవసరమైన పనులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదివరకే ప్రతి మండలంలో ప్రస్తుతం ఉన్న నీటి వనరులను గుర్తించి అవసరమైన చోట బోర్లు వేయడం, డీపెనింగ్ పనులు చేపట్టడం జరిగిందని ఇంకనూ మండలాలలో తాగునీటి సమస్యలు ఉన్నట్లయితే ముందస్తుగా గుర్తించి అందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని, ఈ నిధులను సకాలంలో ఖర్చు చేసి అందుకు సంబంధించిన బిల్లులను జిల్లా పరిషత్ లో సమర్పించాలన్నారు. మండలస్థాయిలో ఎంపిడిఓలు, మున్సిపల్ స్థాయిలో కమిషనర్లు వైద్యఆరోగ్య శాఖతో సమన్వయం చేసుకుని సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న ప్రాంతాలు, వ్యాప్తి చెందేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలు సమాచారాన్ని పొంది వ్యాధులను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జెడ్‌పి సిఈఓ రవి కుమార్ నాయుడు, డిపిఓ సుధాకర్ రావు, అధికారులు పాల్గొన్నారు.

విజయవాడకు బయలుదేరిన ఆశాలు

బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి: సిఐటియు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం ఏపీ ఆశా కార్మికుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే మహా ధర్నాకు చిత్తూరు జిల్లా నుంచి ఆశా కార్మికులు భారీగా బయలుదేరారు. చిత్తూరు రైల్వేస్టేషన్ వద్ద సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, యూనియన్ జిల్లా కార్యదర్శి గంగా ఆధ్వర్యంలో వందలాదిమంది శేషాద్రి ట్రైన్‌కు బయలుదేరి వెళ్లడం జరిగింది. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశాల సమస్యలు పరిష్కరించామని నిర్దిష్టమైన జీవోలు ఇవ్వకుండా నోటిమాటలతో చెప్పడం సరైనది కాదన్నారు. కార్మికులు పోరాటానికి పిలుపునిచ్చినప్పుడు వారిని దారి మళ్ళించడానికి కొన్ని సమస్యలు పరిష్కరించామని చెప్పడం పాలకులకు షరా మామూలు అయ్యిందన్నారు. ధర్నా ఉందని తెలిసి ముందురోజు ప్రభుత్వం ఆశాలకు గ్రాట్యూటీ ఇస్తున్నామని వయోపరిమితి పెంచామని ప్రకటన చేసింది కానీ కనీస వేతనాలు గురించి మాట్లాడలేద అని, ఇచ్చిన వాటికైనా జీవో విడుదల చేయకుండా నోటి మాటలతో చెప్పడం సరికాదన్నారు. కార్మికులు ఐక్యంగా పోరాటాలు చేస్తూనే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు, ప్రభుత్వం గానీ స్పందిస్తే పోరాటాలు ఎందుకు చేస్తారని ప్రశ్నించారు. కొన్నిచోట్ల అధికార పార్టీ నాయకులు కార్మికులను భయపెట్టి పాలాభిషేకాలు చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఇష్టంలేని పెళ్లి చేసుకుందని

కూతురిపై కత్తులతో దాడి

- గాయపడ్డ మరో ముగ్గురు
- క్షతగాత్రులు క్షేమమే..
- నిందితున్ని అదుపులోకి తీసుకుంటాం: జిల్లా ఎస్పీ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కౌసల్య, చంద్రశేఖర్, రమేష్

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం పట్టణంలోని రహదారులు, భవనాల శాఖ అతిథి గృహ ఆవరణలో బుధవారం ప్రేమ జంటపై కత్తులతో దాడి జరిగిన ఘటన స్థానికంగా కలవరం లేపింది. గుడుపల్లి మండలం అగరం కొత్తపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్, అదే గ్రామానికి చెందిన కౌసల్య ఒకరినొకరు ప్రేమించుకున్నారు. ఈనెల 3వ తేదీ పెద్దల అంగీకారం లేకుండా తమిళనాడు రాష్ట్రం, తిరుపత్తూరు జిల్లా, యాదగిరి హిల్స్ పై ఉన్న దేవాలయంలో వివాహం చేసుకున్నారు. అయితే వారి పెళ్లి అయిపోయిన తర్వాత భవిష్యత్తులో గొడవలేం లేకుండా.. తమ వాళ్లతో మాట్లాడాల్సిందిగా ప్రేమ జంట గ్రామ పెద్దలను ఆశ్రయించారు. వారి ప్రేమపెళ్లి వ్యవహారంపై పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఈ మేరకు కౌసల్య చంద్రశేఖర్‌తో పాటు కౌసల్య తండ్రి శివశంకర్ కూడా పంచాయితీకి పిలిపించారు. కుప్పంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ లో రాజీ చేసేందుకు ప్రయత్నించారు. కానీ, కూతురి ప్రేమ వివాహం చేసుకోవడం ఇష్టంలేని శివప్ప పెద్దల సమక్షంలోనే కత్తితో కౌసల్య, చంద్రశేఖర్‌లపై ఒక్కసారిగా దాడికి దిగాడు. ఈ ఊహించని ఘటనతో అంతా షాక్ అయ్యారు. అసలు అక్కడ ఏం జరుగుతుందో అర్థం చేసుకోనేలోపే.. శివశంకర్ ప్రేమ జంటపై కత్తి పోట్ల వర్షం కురిపించాడు. శివశంకర్‌ను ఆపే ప్రయత్నంలో చంద్రశేఖర్ మేనమామ రమేష్, పంచాయతీ పెద్దమనిషిగా వ్యవహరించిన సీతారామప్ప కూడా కత్తి గాయాలకు గురయ్యారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన కౌసల్య, చంద్రశేఖర్‌లను చికిత్స కోసం దగ్గర్లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దాడికి ప్రయత్నించిన నిందితుడు పారిపోయాడని, క్షతగాత్రులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలిపారు. సమాచారం అందుకున్న కుప్పం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.



కౌసల్య, చంద్రశేఖర్‌ల పెళ్లి ఫొటో (ఫైల్)

నిందితున్ని అదుపులోనికి తీసుకుంటాం: ఎస్పీ

కుప్పం పట్టణంలో ప్రేమజంటపై జరిగిన దాడి విషయం తెలియడంతో చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం క్షతగాత్రులు చికిత్స పొందుతున్న ఆసుపత్రికి చేరుకుని, బాధితులను విచారించి, వారి ఆరోగ్య పరిస్థితి పై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ కౌసల్య ప్రేమ వివాహం చేసుకోవడం నచ్చని ఆమె తండ్రి ప్రేమ జంటపై కత్తితో దాడి చేయడం జరిగిందని, ఈ దాడిలో మొత్తం నలుగురు గాయాల పాలైనట్టు తెలిపారు. క్షతగాత్రులు కుప్పం పట్టణంలోని బిఆర్‌డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలిపారు. వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆందోళన చెందవలసిన అవసరం లేదని వైద్యుల ద్వారా తెలిసిందన్నారు. దాడికి పాల్పడ్డ నిందితుడు పరారీలో ఉన్నారని, అతడిని అదుపులోనికి తీసుకోవడానికి పోలీసులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కుప్పం డిఎస్‌పి పార్థసారథి, బిఆర్‌డి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సురేష్ బాబు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

స్వర్ణకుప్పం లక్ష్యం

- ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు
- కుప్పంను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతాం

కడా పీడీ వికాస్ మరమ్మత్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కడా పీడీ వికాస్ మరమ్మత్

ప్రజాశక్తి- కుప్పం టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత కుప్పం పర్యటనలో భాగంగా ఆవిష్కరించిన స్వర్ణ కుప్పంను సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వ అధికారులు పనిచేస్తున్నట్టు కడా పీడీ వికాస్ మరమ్మత్ తెలిపారు. బుధవారం ఆయన కడా కార్యాలయంలో పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గాన్ని అంచలంచెలుగా అభివృద్ధి చేస్తూ స్వర్ణ కుప్పం సాధిస్తామని తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపడం జరిగిందని, అధికారులు సిద్ధం చేసిన ప్రణాళికలను ప్రభుత్వం ఆమోదిస్తూ, నిధులు కూడా మంజూరు చేసినట్టు తెలిపారు. కుప్పం పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామని, జూలైలోగా పట్టణాభివృద్ధి పనులను పూర్తి చేస్తామని తెలిపారు. పలమనేరు– క్రిష్ణగిరి జాతీయ రహదారిని ఫోర్‌లైన్ రోడ్డుగా నిర్మిస్తామని, నియోజకవర్గ పరిధిలో రహదారుల నిర్మాణానికి 53 కోట్ల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసినట్టు తెలిపారు. నియోజకవర్గంలోని నిరుపేద కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున హౌసింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. నిరుద్యోగ నిర్మూలనలో భాగంగా పలు పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, ఇప్పటికే మదర్ డైరీకి స్థలం కేటాయించామన్నారు. ఈ సంస్థ ద్వారా స్థానికంగా 8వేల మందికి ఉపాధి లభించే అవకాశం ఉందన్నారు. అలాగే మార్చి 11 జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, ఈ మేళాలో 12 వేల మందికి ఉద్యోగ అవకాశాలు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ సైకిల్ ద్వారా మహిళలకు సబ్సిడీ రూపంలో 400 ఈ సైకిల్స్ అందిస్తామని తెలిపారు. ప్రజల ఆరోగ్య దృష్ట్యా కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సిటీ స్కాన్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. హంద్రీనీవా పనులు ప్రారంభించామని, వీటిని ఐదు ఆరు నెలల్లో పూర్తిచేసి కుప్పం ప్రజలకు కృష్ణ జలాలను అందించడం జరుగుతుందన్నారు. అలాగే నియోజకవర్గాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, క్రీడా సముదాయాల ఏర్పాటు, స్మశాన వాటికల ఏర్పాటు, వాటి అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు.

ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈ పార్కులు

జిల్లా పరిశ్రమలు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

జిల్లాలో ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అవసరమైన వారిని ఎంపిక చేసి వారికి శిక్షణా కార్యక్రమాల నిర్వహణకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిఐఆపిసి) సమావేశం జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలలో ఉపాధి అవకాశాల పెంపుపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలని, పరిశ్రమల స్థాపన ద్వారా ఆర్థిక పురోభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని, ఈ దిశగా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజక వర్గంలో ఎంఎస్‌ఎం ఈ పార్కుల ఏర్పాటుకు కృషి చేస్తుందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను సమకూర్చడంలో భాగంగా వారి అవసరాలకు అనుగుణంగా అవసరమైన వారికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి ఉపాది అవకాశాల కల్పనకు జిల్లా పరిశ్రమల కేంద్రం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ కలిసి పనిచేయాలని ఆదేశించారు. ఇది వరకే పరిశ్రమల స్థాపనకు కొరకు భూమి కేటాయింపులు చేసుకున్నవారు పరిశ్రమలను స్థాపించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు రూ.544 కోట్లతో 59,044 మందికి ఉపాధి కల్పించేలా 14,761 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఉదయం పోర్టల్ దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. గంగ్రాజుపల్లిలో పారిశ్రామికవాడలో దొంగతనాలు జరుగుతున్నాయని, ఇందుకు చర్యలు చేపట్టాలని పారిశ్రామిక వేత్తలు కలెక్టర్ దృష్టికి తీసుకుని రాగా వెంటనే స్పందించిన కలెక్టర్, జిల్లా ఎస్పితో ఫోన్ ద్వారా చర్చించి అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో మామిడి ప్రాసెసింగ్ యూనిట్లలో కూడా ఉపాధి అవకాశాలు కలవని శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, జిల్లా పండ్ల సమాఖ్య సభ్యులు బాబీ కలెక్టర్ దృష్టికి తీసుకొని వచ్చారు. జిఎం ఇండస్ట్రీస్ వెంకట్ రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, ఏపీ ఐఐసీ జోనల్ మేనేజర్ సుబ్బారావు, ఎల్డీఎం హరీష్, డిపిఓ సుధాకర్ రావు, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు మురళి కృష్ణా, మధుసూదన్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

సౌత్ జోన్ షూటింగ్ బాల్ పోటీల్లో

బల్ల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: తెలంగాణ షూటింగ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నాలుగవ సౌత్ జోన్ షూటింగ్ బాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో రామకుప్పం మండలం, బల్ల గ్రామానికి చెందిన విద్యార్థి పాపారావు మౌనిష్ విశేష ప్రతిభ కనబరిచాడు. బల్లకు చెందిన పాపారావు కుమారుడు పాపారావు మౌనిశ్ ఎస్వీ యూనివర్సిటీలో డిగ్రీ చదువుతున్నాడు. ఈనెల 1, 2,3 తేదీల్లో నల్గొండ ఎన్‌జీ కాలేజీలో నిర్వహించిన షూటింగ్ బాల్ పోటీల్లో సీనియర్ పురుషుల విభాగంలో విజేతగా నిలిచారు. పోటీలో విశేష ప్రతిభ కనబరిచిన మౌనీష్‌ను టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి నాగభూషణం, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పట్ర నారాయణాచారి అభినందించారు.



పొగాకు ఆరోగ్యానికి హానికరం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పొగాకు ఉత్పత్తులను మానుకోవాలంటూ అవగాహన కల్పిస్తున్న టూ టౌన్ పోలీసులు బుధవారం అవగాహన ర్యాలీ నిర్వరహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొగకు ఉత్పత్తులు అయిన బీడీ, సిగరెట్, హాన్స్, ఖైని, తంబాకు, నస్యం, వీటిలో ఏ వస్తువులు వాడిన నికోటిన్ అనే హానికరమైన పదార్థం రక్తంలో కలిసి వివిధ రకాల క్యాన్సర్లకు, గుండెజబ్బులకు గురిచేస్తుందన్నారు. శరీరంలో వెంట్రుకలు, గోర్లు తప్ప ఏ భాగానికైనా క్యాన్సర్ రావచ్చు అన్నారు. చట్టరీత్యా బహిరంగ ప్రదేశాలలో పొగ తాగడం నేరం అలా చేసిన వారికి రూ.200ల వరకు జరిమానా విధిస్తారని, సెక్షన్ 6ఎ 18 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న వ్యక్తులకు పొగాకు ఉత్పత్తులు విక్రయించరాదని తెలిపారు. సెక్షన్ 6బి ప్రకారం విద్యాసంస్థకు 100 గజాల పరిధిలో పొగాకు ఉత్పత్తులు విక్రయంపై నిషేధం విధించబడిందని టూ టౌన్ సీఐ నెట్టికంటయ్య తెలిపారు. సిఐ మాట్లాడుతూ కళాశాల పరిధిలోని టీ బంకులు కిరాణా షాపుల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయించకూడదని తెలిపారు. విద్యార్థులందరూ వీటిపై అవగాహనతో పొగాకు ఉత్పత్తుల జోలికి వెళ్లకుండా, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ పోలీస్ స్టేషన్ అధికారులు, ఎక్సైజ్ డిపార్ట్మెంట్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్, తబకోకు కంట్రోల్ ప్రోగ్రాం సోషల్ వర్కర్ లావణ్య పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న టూ టౌన్ పోలీసులు

8న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈనెల 8వ తేదీ శనివారం జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర న్యాయ సేవఅధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ, సుప్రీంకోర్టు వారి ఆదేశాల మేరకు ఈ నెల 8న శనివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనం అదా అవుతుందని తెలిపారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని దాని పై ఆపిల్ ఉండదన్నారు. లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు, న్యాయవాదులు, రెవెన్యూ, పోలీసు, బ్యాంకు అధికారులు, చిట్ ఫండ్ కంపెనీలు, బీమ సంస్థ ప్రతినిధులు, కక్షదారులు పాల్గొని విజయవంతంగా నిర్వహించి జిల్లాలో ఎక్కువ కేసులు పరిష్కరించి చిత్తూరు జిల్లాను రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో ఉండేలా సహకరించాలని కోరారు.

కృత్రిమ అవయవాల 3డి ప్రింటింగ్‌పై సదస్సు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అపోలో విశ్వవిద్యాలయం, ఐఐటి తిరుపతి, అపోలో వైద్యకళాశాల సంయుక్తంగా కృత్రిమ అవయవాలను 3డి ప్రింటింగ్ విధాన ప్రక్రియపై ఒక ప్రతిష్టాత్మక సదస్సును అపోలో నాలెడ్జ్ సిటీలో విజయవంతంగా నిర్వహించాయి. ఈసదస్సులో అపోలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వినోద్ భట్ ముఖ్య అతిథిగా పాల్గొని, 3డి ప్రింటింగ్ వైద్యరంగంలో విప్లవాత్మక మార్పుల గురించి వివరించారు. ఐఐటి తిరుపతి నుంచి డాక్టర్ మామిళ్ల రవి శంకర్ బయోమెడికల్ అప్లికేషన్‌లో ఇంప్లాంట్ల ఫినిషింగ్ విధాన ప్రక్రియను వివరించారు. లైవ్ డెమోస్ ద్వారా 3డి ప్రింటింగ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించడం జరిగింది. ఇది తక్కువ సమయంలో, అధిక ఖచ్చితత్వంతో కృత్రిమ అవయవాల తయారీకి సంకేతం చేస్తుందని తెలిపారు. వైద్యశాస్త్ర విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు సదస్సుకు భారీ సంఖ్యలో హాజరై, సాంకేతిక పరిజ్ఞానం అవకాశాలను అన్వేషించారు. ప్రొఫెసర్లు వి.సుభద్రా దేవి, రవిశంకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్

ముగిసిన రుణాల ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో బీసీ, ఓబీసీ, కాపు కార్పొరేషన్ రాయితీ రుణాల మంజూరు కోసం నగరపాలక కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం 26 నుంచి 50 వార్డుల పరిధిలోని లబ్దిదారులకు బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆన్‌లైన్లో చేసిన దరఖాస్తుల ప్రకారం ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి ఇంటర్వ్యూ చేశారు. నగరపాలక పరిధిలోని 38 బ్యాంకు బ్రాంచ్‌ల అధికారులు ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఇంటర్వ్యూల కోసం చేపట్టిన ఏర్పాట్లు, నిర్వహణను కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ అవినేని ప్రసాద్ పర్యవేక్షించారు.

76 మందికి ఉపాధి



ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: నగిరి పట్టణ పరిధిలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో అమెజాన్ వేర్ హౌస్ చెన్నై, సేవియర్ మేనేజిమెంట్ కంపెనీలు పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ తెలియజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిగ్రీతోపాటు విజ్ఞానం, నైపుణ్యాలు చాలా ముఖ్యమని, అంతేగాక ఎప్పటికప్పుడు నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. ఈ జాబ్ మేళాకు కళాశాల విద్యార్థులతో పాటు ఇతర కళాశాలల విద్యార్థులు 96 మంది హాజరైనారని, ఇందులో 78 మంది మంది అభ్యర్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల జెకెసి కోఆర్డినేటర్ డాక్టర్ పంకజ కెరీర్ గైడెన్స్ కోఆర్డినేటర్ డాక్టర్ రేవతి, జెకెసి మెంటార్ లాల్ బాషా, కంపెనీల ప్రతినిధులు హాజరైనట్లు తెలియజేశారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: తిరుపతి శ్రీ రమాదేవి మల్టీ స్పెషలిస్ట్ హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత వైద్యశిబిరం బుధవారం బైరెడ్డిపల్లిలోని కోదండ రామస్వామి గుడి ఆవరణలో నిర్వహించారు. ఈ శిబిరానికి 107మంది హాజరు కాగా డాక్టర్ వెంకటరమణ వారిని పరిశీలించి చికిత్సలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించారు. అనంతరం అనారోగ్యం ఎక్కువగా ఉన్న వారిని 33 మందిని గుర్తించి మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని శ్రీ రమాదేవి మల్టీ స్పెషలిస్ట్ హాస్పిటల్‌కు తరలించారు. వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని కె.సుబ్రహ్మణ్యం గౌడ్, టి.సుబ్రమణ్యం తెలిపారు. కార్యక్రమంలో పిఆర్‌ఓ భారవ్ చంద్ర, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేలం ద్వారా పంచాయతీకి ఆదాయం



ప్రజాశక్తి- ఐరాల: కాణిపాకం గ్రామపంచాయతీలో బుధవారం జరిగిన వేలంపాటలో రూ.14,25,000లు ఆదాయం సమకూరినట్లు కాణిపాకం ఇన్చార్జి పంచాయతీ సెక్రటరీ కుసుమ కుమారి తెలిపారు. అగరంపల్లి గ్రామానికి చెందిన రాధ వారపు సంతకు గానూ రూ.7,64,000లు, దినసరి సంతకు రూ.6,11,000లకు దక్కించుకున్నారు. అగరంపల్లి చెరువును రూ.20,000లకి జయచంద్ర రెడ్డి, కాణిపాకం చెరువును రూ.30,000లకు మురళీ అను వారు దక్కించుకున్నట్లు ఆమె తెలిపారు. సర్పంచ్ శాంతి సాగర్ రెడ్డి, వార్డు సభ్యులు, వేలం పాట దారులు, గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఘనంగా శివపార్వతుల తెప్పోత్సవం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం

మండలంలోని మొగిలి గ్రామంలోగల శ్రీ స్వయంభు కామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో చివరి రోజు బుధవారం శివపార్వతుల తెప్పోత్సవం ఘనంగా జరిగింది. ఉభయదారులుగా బంగారుపాళ్యంకు చెందిన బేబీ మాధవ నాయుడు వ్యవహరించారు. ఆలయ వంశపార ధర్మకర్త విజయ్ కుమార్, కార్యనిర్వాహణాధికారి మునిరాజులు, ఆలయ సిబ్బంది శరవణ లోకనాథం, మధు పాల్గొన్నారు.

పెయింటింగ్ పోటీలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు నేతృత్వంలో చిత్తూరు మహిళా డీఎస్పీ విజయశేఖర్ పర్యవేక్షణలో మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా బుధవారం డీఈవో కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని, తమ సృజనాత్మకతతో సమానత్వాన్ని ప్రతిబింబించే చిత్రాలను వేశారు. విజేతలకు బహుమతులు అందజేసి, సమానత్వ సందేశాన్ని మరింత విస్తృతంగా ప్రచారం చేసేందుకు చిత్తూరు జిల్లా పోలీసులు ప్రోత్సహించారు. 8వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఈ తరహా కార్యక్రమాలు మహిళలకు శక్తిని, మానసిక స్థైర్యాన్ని, స్వీయరక్షణ సామర్థ్యాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని తెలిపారు.

8 నుంచి శ్రీ లక్ష్మీనరసింహస్వామి

బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి- రొంపిచర్ల: పులిచెర్ల మండలంలోని దేవళంపేట గ్రామంలో వెలసినటువంటి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈనెల 8వ తేదీన ప్రారంభమై 18వ తేదీ వరకు పది రోజులపాటు జరుగుతాయని దేవాలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. 14వ తేదీ శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం, 15 రథోత్సవం, 16 పార్వేట ఉత్సవం, 17 చక్రస్నానం, 18 ఊంజల సేవ జరుగుతాయని తెలియజేశారు. భక్తులందరూ పాల్గొని స్వామివారి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని కోరారు.

హాల్ టికెట్ లేక

9 మంది పరీక్షలకు దూరం

విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు ఆందోళన

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: ఇంటర్ పరీక్షలకు హాల్ టికెట్లు లేక తొమ్మిది మంది విద్యార్థులు పరీక్షలకు దూరమైన ఘటన ఓ కళాశాల నిర్లక్ష్యం కారణంగా చోటుచేసుకుంది. దీంతో విద్యార్థితో కలిసి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. బాధితుల కథనం మేరకు.. చిత్తూరు జిల్లా పెనుమూరుకు చెందిన ఎస్వీ జూనియర్ ప్రైవేట్ కళాశాలను, కొనుగోలు చేసిన ఓం ప్రకాష్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా తిరుపతి బైరాగిపట్టెడలో కళాశాల ఏర్పాటు చేశారు. దీనిపై ఫిర్యాదు రావడంతో గతంలోనే ఇంటర్మీడియట్ అధికారులు ఆ కళాశాల యజమానికి నోటీసులు సైతం జారీ చేశారు. తాజాగా ఇంటర్మీడియట్ పరీక్షల్లో 86 మంది విద్యార్థులకు పెనుమూరు ఎస్వీ జూనియర్ కళాశాల పేరుతోనే చిత్తూరులో పరీక్ష కేంద్రాలకు పంపారు. అందులో 9 మంది విద్యార్థులకు హాల్ టికెట్లు లేకపోవడంతో పరీక్షలకు అనుమతించలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాల వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని కళాశాల యాజమాన్యంతో మాట్లాడారు. కళాశాల సిబ్బంది తప్పిదం వల్ల విద్యార్థులకు హాల్ టికెట్లు మంజూరు కాలేదని, జూన్‌లో జరిగే పరీక్షలకు ప్రత్యేకంగా ఆ తొమ్మిది మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని కళాశాల యాజమాన్యం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఓటేరు చెరువును కాపాడండి

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్ : ఓటేరు చెరువును మట్టితో పూడ్చిన భూకబ్జాదారులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో బుధవారం ఓటేరు చెరువును భూకబ్జాదారులు అక్రమంగా పూడ్చి వేయడంతో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి హైవే ఆనుకుని ఉన్న 376, 77 సర్వే నెంబర్ ఓటేరు చెరువును అర్ధరాత్రిలో భూకబ్జాదారులు 30 టిప్పర్లతో మట్టితోలి పూడ్చివేశారన్నారు. చెరువును పూడ్చిన వారిపై ఇంతవరకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోలేదని వాపోయారు. సుమారు 1000 కోట్లకు పైగా విలువ కలిగిన చెరువు భూమిని కాపాడాలని రెండు నెలల క్రితం కలెక్టర్‌ని కలిసి వినతి పత్రం సమర్పించామ న్నారు. ఇపుడు దౌర్జన్యంగా భూకబ్జాదారులు చెరువును పూడుస్తూ ఉంటే, ఏ మాత్రం చర్యలు తీసుకోలేదని దుయ్యబట్టారు. ఐదు నెలల క్రితం కుక్లైన్ తో చెరువు నీళ్ల తొలగిస్తే చర్యలు శూన్యమన్నారు. కమ్యూనిస్టులు చెరువును కాపాడాలని పరిశీలనకు వెళితే లాండ్ ఆర్డర్ అతిక్రమణ చేస్తున్నారని పోలీసులు హెచ్చరించే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఓటేరు చెరువు అనుకొని స్థానిక ఎమ్మెల్యే నాని నివాస గృహం ఉన్నా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. బడా నాయకులు భూమిని కాజేయడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. కబ్జాదారుపై చర్యలు తీసుకోకుంటే తిరుపతి రూరల్ తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, నగర కార్యవర్గ సభ్యులు ఎన్ శివ, శ్రీరాములు, విజయ, అలివేలమ్మ, అల్లా బక్షు, రవి, కిషోర్, శ్రీనివాసులు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలి

పివికేఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: భారతదేశ అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలని పివికేఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.జీవన్ జ్యోతి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం యువజన వ్యవహారాలు క్రీడా మంత్రిత్వ శాఖ వారి ఆదేశాల మేరకు జిల్లాస్థాయి యూత్ పార్లమెంట్ కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను కళాశాల యాజమాన్యం స్థానిక నెహ్రూ యువ కేంద్రం అధికారులతో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ యువత మేధాశక్తిని ఉపయోగించి ప్రపంచంలో మన దేశాన్ని ప్రథమ స్థానంలో ఉండే విధంగా చేయాలని అందులో భాగంగా యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలన్నారు. యూత్ పార్లమెంట్లో పాల్గొనే అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన అధికారి బి.ప్రదీప్ కుమార్ సూచించారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల నుండి 18 నుండి 25 సంవత్సరాల వయసు కలిగిన యువత ఈ పోటీలలో పాల్గొనవచ్చు అని తెలిపారు. ఈనెల 15వ తేదీన స్థానిక పివికేఎన్ కళాశాలలో తదుపరి ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎన్.సుశీల భారతి, నెహ్రూ యువకేంద్ర ప్రాంతీయ గణంకా అధికారి ఎంసి.బాబురెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీవీకేని కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి

సర్వీస్ ప్రొవైడర్లకు శిక్షణా కార్యక్రమం



ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పట్టణంలోని శ్రీనగర్ కాలనీ వరుణ్ ఐటిఐ కాలేజీలో మెప్మా ఆధ్వర్యంలో సర్వీస్ ప్రొవైడర్ల శిక్షణా కార్యక్రమంను బుధవారం మునిసిపల్ కమిషనర్ ఎన్‌వి.రమణారెడ్డి ప్రారంభించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ పలమనేరు పట్టణవాసులకు అవసరమైన సేవలు ఇంటి వద్దే అందిస్తూ కార్మికులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ – మెప్మా ఆధ్వర్యంలో సిటీ లైవ్ల హుడ్ కేంద్రాలు ఏర్పాటు చేసి పలు విభాగాలకు చెందిన దరఖాస్తు స్వీకరించి వారికి శిక్షణ యిచ్చి ప్రజల ఇంటి వద్దకే వివిద సేవలను అందించాలనే ఉద్దేశంతో సర్వీస్ ప్రొవైడర్లకు శిక్షణ ఇవ్వడం జరగుతున్నదన్నారు. ఇందులో ఎలక్ట్రికల్, కార్పెంటర్, శానిటరీ ప్లంబింగ్, ఏసి, రెఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్, వాటర్ ప్యూరిఫైర్, బ్యూటిషియన్, తదితర సేవలు అందిస్తారని తెలిపారు. ఇందుకోసం కొత్తగా యాప్‌ను అందుబాటులో తీసుకువచ్చి హోమ్ ట్రయాంగిల్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఈ సేవలందించే సర్వీసు ప్రొవైడర్లకు గుర్తింపు కార్డు కూడా ఇస్తారని ప్రజల అవసరాన్ని బట్టి వారి ఇంటివద్దకే సంబంధిత నిపుణుడిని పంపిస్తారని తెలిపారు. మునిసిపల్ మేనేజరు ఖాదర్ మొహిద్దీన్, సిఎంఎంవి బాబ (సిటీ మిషన్ మేనేజర్), ట్రైనింగ్ కోఆర్డినేటర్ పరసాద్ రెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలో 'నవోదయం 2.0



ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: రాష్ట్రాన్ని నాటుసారా రహితంగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కే.శ్రీనివాస ఆచారి అన్నారు. బుధవారం నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసాచారి మాట్లాడుతూ నాటు సారా తయారీ, వినియోగాన్ని నిర్మూలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నవోదయం 2.0 రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని నగరి టెన్‌ఫోర్స్‌మెంట్ పోలీసు వారు చేప్పటారని తెలిపారు. గతంలో నవోదయం కార్యక్రమంతో నాటు సారాను నిర్మూలించామని చెప్పారు. ఆర్థికంగా, ఆరోగ్యపరంగా పేదలు చితికిపోకూడదన్న లక్ష్యంతోనే మరోసారి నవోదయం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. గంజాయి, డ్రగ్స్, నాటుసారా విషయంలో యువత అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. గంజాయి, డ్రగ్స్ ఎక్కడ కనిపించినా, ఎక్కడ అమ్మకాలు జరుగుతున్నా 14405, 9440902549 నంబర్లకు కాల్‌చేసి సమాచారం అందించాలని కోరారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, సివిల్ ఎస్సై బలరాం, హెడ్ కానిస్టేబుల్ గోవిందస్వామి, మాజీ ఎంపీపీ రాజేశ్వరి వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఇళ్లను కొల్లగొట్టే ఏడుగురు దొంగలు అరెస్ట్

రూ. 37 లక్షల విలువైన సొత్తు స్వాధీనం



ప్రజాశక్తి - తిరుపతి డెస్క్ : ఇళ్లను కొల్లగొట్టి చోరీల కు పాల్పడి ఏడు మంది దొంగలను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి 37 లక్షలు రూపా యలు విలువ గలిగిన సొత్తు స్వాధీనం చేసుకు న్నట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమవావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పగలు వీధుల్లో తిరుగుతూ, తాళాలు వేసిన ఇళ్లలో రాత్రిళ్లు చోరీలు చేసేవారిపై ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిఘా ఉంచారన్నారు. పోలీసుల నిఘాల్లో తిరుపతి శివ జ్యోతి నగర్‌లోని అయ్యప్ప కాలనీ చెందిన ముత్తాల అరుణ్, దేరంగుల జగదీష్, ముత్తాల తేజస్, తిరుపతి జిల్లా, బాలాయపల్లి మండలం వెంగమాంబపురం గ్రామానికి చెందిన అక్కుర్తి నవీన్, అక్కుర్తి పెంచలయ్య, తిరుపతి రూరల్ మండలం దుర్గ సముద్రం గ్రామానికి చెందిన పూతల విగ్నేష్ రెడ్డి, తిరుపతి రూరల్ మండలం మంగళంలోని బి టి ఆర్ కాలనీకి చెందిన లోకనాథ్ రెడ్డిలు చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించి, వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 35 లక్షల విలువగల బంగారం, 1,20,000 విలువగల వెండి నగలు, ఓ కారు, ఓ ఆటో, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ముత్తాల తరుణ్ పై 29 కేసులు, అక్కుర్తి నవీన్‌పై 11 కేసులు, అక్కుర్తి పెంచలయ్యపై 18 కేసులుఉన్నాయని, వీరి ముగ్గురుపై సస్పెక్ట్ షీట్లు ఉన్నట్లు వెల్లడించారు. వీరిని రిమాండుకు తరలిస్తున్నట్లు తెలిపారు. ముద్దాయిలను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన పోలీసులకు రివార్డులు ప్రకటించారు. ఈ సమావేశంలో ఏఎస్ పి, డిఎస్ పి, సీఐ, ఎస్ ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రెండో పెళ్లి చేసుకున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- కార్వేటినగరం: భార్యను మోసం చేసి రెండో వివాహం చేసుకున్న వ్యక్తి అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాజ్ కుమార్ బుధవారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ టీకేఎం పేట దళితవాడకు చెందిన పి.క్రిష్ణయ్య కుమారుడు పి.రవీంద్రబాబుకు 2013వ సంవత్సరంలో కార్వేటినగరం పెద్దహరిజనవాడకు చెందిన వేలయ్య కుమార్తె భాగ్యలక్ష్మిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వారికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తన భార్యను మోసం చేసి టీకేఎం పేట గ్రామానికి చెందిన ఏలుమలై కుమార్తె కాంచన అనే అమ్మాయికి మాయమాటలు చెప్పి ఆమెను కూడా డబ్బుల కోసం రెండవ వివాహం చేసుకున్నాడు. దీంతో మొదటి భార్య భాగ్యలక్ష్మి ఇచ్చిన పిర్యాధు మేరకు అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సుబ్రహ్మణ్యం మృతికి నివాళి

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: మండల వ్యవసాయ బ్యాంకు (సింగిల్విండో) అధికారి సుబ్రహ్మణ్యం గుండె జబ్బుతో బుధవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టిడిపి నేతలు ఆయన మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండలాధ్యక్షుడు ఆనంద రెడ్డి, కార్యదర్శి నరసింహులు, చిన్న కృష్ణ చలపతి తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ

ఇంటింటా ఫీవర్ సర్వే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ ఆధ్వర్యంలో బుధవారం నగర పరిధిలోని తోటపాల్యం ఏరియాలో అనుమానిత డెంగీ కేసును తనిఖీ చేశారు. అనంతరం ఏఎన్ఎం, ఆషా కార్యకర్తలతో కలిసి ఇంటి ఇంటి ఫీవర్ సర్వే, దోమల లార్వా సర్వే నిర్వహించారు. దోమల లార్వాలను గుర్తించి వాటిని తొలగించాలని, తొలగించలేని చోట అబేటుతో పిచికారి చేయించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు డెంగీ, చికున్ గున్యా, మలేరియా, బోదకాలు మొదలగు జ్వరాలు రాకుండా వుండాలంటే ఫ్రైడే డ్రైడే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, సూపర్వైజర్ నారాయణ, మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ మురళి, ఏఎన్ఎం హేమలత, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది



కోరికలు తీరాలని కొందరు.. అవి తీరిన తర్వాత మరికొందరు.. ఇతరులకు ఉపయోగపడాలని ఇంకొందరు.. శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి విరాళాలు అందజేస్తుంటారు. అలా చాలామంది భక్తితో పాటు సామాజిక సేవలో భాగంగా పలువురు దాతలు వస్తు, నగదు, ఇతరత్రా రూపాల్లో విరాళాలు అందజేశారు, అందజేస్తున్నారు. అయితే అటువంటి దాతల పట్ల దేవస్థానం అధికారులు ఏ మాత్రం గౌరవ మర్యాదలు లేకుండా వ్యవహరిస్తున్నారు. దాతలిచ్చిన బహూమానాలపై చిన్న చూపు చూస్తున్నారు. విరాళాలుగా వచ్చిన వాటిని మూలన పడేస్తున్నారు. ఇందుకు దేవాలయినికిచ్చిన అంబులెన్స్ ఒక ఉదాహరణ.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :హైదరాబాద్‌కు చెందిన విభా సీడ్స్ యాజమాన్యం ఆలయానికి అంబులెన్స్ విరాళంగా అందజేసింది. దీని వల్ల ఎంతో మందికి అత్యవసర సేవలు అంది ప్రాణాలు కాపాడుకున్నారు. అలాంటి అంబులెన్స్ మరమ్మతుకు గురైతే నిర్లాక్షిణ్యంగా మూలన పడేశారు. సన్నిధి వీధిలోని శివసదన్ అతిథి గృహం చెట్టు కింద అంబులెన్స్ విశ్రాంతి తీసుకుంటోంది. వాహనానికి మరమ్మతులు చేస్తే ఆలయానికి వచ్చే భక్తులకు ఉపయోగపడుతుంది. లేదా పట్టణ ప్రజలకు కూడా ఉపయోగపడుతుంది. నిర్వహణ భారం ఎక్కువగా ఉంటే స్థానిక ఏరియా ఆసుపత్రికి అప్పగించాలన్న డిమాండ్ కూడా ఉంది. లేదా స్వచ్ఛంద సంస్థలకు అప్పగిస్తే వారి నిర్వహణలో ఉంటుంది. అధికారులకు అలాంటి ఆలోచన రాలేదు. మరమతులకు గురైన వాహనాన్ని మూలన పడేసి మరో వాహనాన్ని వినియోగిస్తున్నారు. అంబులెన్స్‌ను విరాళంగా ఇచ్చిన దాతకు సమాచారం అందించినా వారు మరమ్మతు చేయించే అవకాశం ఉంది. అధికారులు ఆ ప్రయత్నం కూడా చేయలేదు. ఫలితంగా లక్షల రూపాయలతో కొనుగోలు చేసిన వాహనం నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా ఆలయాధికారులు స్పందించి వాహనానికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

'చలో విజయవాడ' ధర్నాలో గూడూరు మున్సిపల్ కార్మికులు

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి
ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్



ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సి. ఐ.టి.యు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం విజయవాడ అలంకార్ ధర్నా చౌక్ వద్ద జరిగిన చలో విజయవాడ కార్యక్రమంలో గూడూరు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి, ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని ఈ ధర్నాలో వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు మున్సిపల్ నాయకులు కోటేశ్వరరావు, మణి, ప్రసాద్, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.